# సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

## • చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్లటౌన్, సెప్టెంబర్ 30: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 53 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని వివరించారు. మరోసారి ప్రజా సంక్షేమ బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే గ్రామాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి , జడ్పీటీసీ మాలతి, వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, తహసీల్దార్ కృష్ణయ్య , బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకట రంగారెడ్డి, వైస్ చైర్మన్ నర్సింహులు, చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజ, ఉప సర్పంచ్ గంగి యాదయ్య, పామెన సర్పంచ్ మల్లారెడ్డి, ఉప సర్పంచ్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

షాద్‌నగర్‌టౌన్, సెప్టెంబర్ 30 : మున్సిపల్ కార్మికులు తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని మున్సిపల్ చైర్మన్ నరేందర్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన వైద్య శిబిరంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజ్, కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్ కొందూటి మహేశ్వరితో కలిసి మాట్లాడారు. వైద్య పరీక్షలు చేయించి మందులను అందజేశారు. కార్మికులకు ఆటలపోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వినయ్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ రుణమాఫీ

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 30: పంట రుణమాఫీలో భాగంగా రంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 65,020 మంది రైతుల ఖాతాల్లో రూ.348.38 కోట్లు జమ చేశారు. మిగతా ఖాతాదారులకు రుణమాఫీ చెల్లింపు పురోగతిలో ఉన్నది. 10,865 మంది రైతుల ఖాతాల్లో రుణమాఫీ చెల్లింపు చేశారు. కానీ, ఖాతాలను మూసివేయడంతో రుణమాఫీ జమ కాలేదు. పై రైతు ఖాతాల్లో 7,194 మంది ఖాతాదారులు రైతు బంధు ఖాతాను కలిగి ఉన్నారు. రుణమాఫీ చెల్లింపు వారి సంబంధిత రైతుబంధు ఖాతాకు జమచేస్తారు. 263 మంది ఖాతాదారులు రుణమాఫీ కోసం ఆధార్‌ను బ్యాంకు అకౌంట్‌కు అనుసంధానం చేయలేదు. రైతుబంధు ఖాతా లేని, ఆధార్ లింక్ కాని ఖాతాలు కలిగిన 1,018 మంది రైతు ఖాతా వివరాలు జిల్లా వ్యవసాయశాఖ సిబ్బంది ప్రత్యక్షంగా రైతులను కలిసి, వివరాలు సేకరించి సంబంధిత బ్యాంకులకు అందజేస్తారు. త్వరలోనే మిగతావారి రైతు ఖాతాల్లో రుణమాఫీ మొత్తం జమ చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

## గ్రామానికి వైకుంఠ రథం అందజేత





మొయినాబాద్, సెప్టెంబర్ 30 : మండల పరిధిలోని సురంగల్ గ్రామానికి చెందిన యాలాల శ్రీనివాస్‌రెడ్డి, యాలాల మాధవరెడ్డి యాలాల నారాయణరెడ్డి జ్ఞాపకార్థం గ్రామానికి వైకుంఠ రథాన్ని అందజేశారు. శనివారం గ్రామ మాజీ వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు గడ్డం వెంకట్‌రెడ్డి పూజా కార్యక్రమం చేసి గ్రామ పంచాయతీ సిబ్బందికి అప్పగించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేగరి రాజు, గ్రామపెద్దలు నర్సింహారెడ్డి, విశ్వనాథం, యాలాల బల్వంత్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి, బి రాజు తదితరులు పాల్గొన్నారు.

## పెరటి తోటల పెంపకంపై దృష్టి సారించాలి



కూరగాయల విత్తనాలు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధి

షాబాద్, సెప్టెంబర్ 30: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు పెరటి తోటల పెంపకంపై దృష్టి సారించాలని వెల్‌స్పన్ ఫౌండేషన్ ప్రతినిధి సంజీవ్‌రంజన్ అన్నారు. శనివారం మండల పరిధిలోని నాగరకుంట గ్రామంలో వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం 40 మంది మహిళలకు కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ, వెల్‌స్పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ, ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం





యాచారం : సమావేశంలో మాట్లాడుతున్న సింగిల్‌విండో చైర్మన్ రాజేందర్‌రెడ్డి

యాచారం, సెప్టెంబర్ 30 : సహకార సంఘం ద్వారా అధిక రుణాలను మంజూరు చేసి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని సింగిల్‌విండో చైర్మన్ రాజేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సబ్సిడీ ద్వారా ఎరువులు, విత్తనాలు విక్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ కారింగు యాదయ్య, డైరెక్టర్లు మక్కపల్లి స్వరూప, కొండా మధుకర్‌రెడ్డి, లక్ష్మయ్య, మాధవి, సీఈవో నాగరాజు, ఏఈవో వసంత, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### పంట రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

మంచాల : అర్హులైన రైతులు పంట రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే రుణాలు అందజేయనున్నట్లు మంచాల సహకార సంఘం చైర్మన్ బుస్సు పుల్లారెడ్డి అన్నారు. మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ ఆవరణలో సర్వసభ్య సమావేశం ముఖ్య కార్యనిర్వాహణాధికారి చింతకింది శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బొద్రమోని యాదయ్య, డైరెక్టర్‌లు దండేటికార్ సత్యనారాయణ, వీ రాంచంద్రారెడ్డి, జెనిగ వెంకటేశ్, హనుమంతురెడ్డి, జనార్దన్‌రెడ్డి, దొడ్డ అరుణమ్మ, రైతులు పాల్గొన్నారు.

**ఆమనగల్లు** : రైతులకు పీఏసీఎస్ ద్వారా అన్ని రకాల రుణాలు అందించి చేయూతనిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సంఘం కార్యాలయంలో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగున్నర సంవత్సరాల కాలంలో రైతులకు వివిధ రకాల రుణాలు అందించామని ఆయన తెలిపారు.పూర్తి స్థాయిలో రుణమాఫీ పొందిన 500 మంది రైతులు మరల రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, డైరెక్టర్లు జోగు వీరయ్య, అరుణమ్మ, అంతిరెడ్డి, వెంకటేశ్, శ్రీపాల్, సేవ్యా నాయక్, వెంకటేశ్, డోల్యానాయక్, జంగమ్మ, సీఈవో గోరటి దేవేందర్, సిబ్బంది అల్లాజీ పాల్గొన్నారు.

**అబ్దుల్లాపూర్‌మెట్టు** : మండల కేంద్రంలోని సహకార సంఘం ప్రధాన కార్యాలయంలో సర్వసభ్య సమావేశంలో సంఘం వ్యవహారాల నివేదికను చైర్మన్ విఠల్‌రెడ్డి చదివి వినిపించారు. వివిధ అంశాలపై చర్చించారు. సకాలంలో బకాయిలు చెల్లించిన 21 మంది రైతులను గుర్తించి ఒక్కొక్కరికి రూ. 5 వేల డీడీని అందించి సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ నార్లకొండ మల్లమ్మ, డైరక్టర్లు యాదిరెడ్డి, జైపాల్‌రెడ్డి, లక్ష్మమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రాములు, భరత్‌కుమార్, మేనేజర్ ఐలేశ్ పాల్గొన్నారు.

**చేవెళ్లటౌన్** : సహకార సంఘం అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నామని చేవెళ్ల సొసైటీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. రుణమాఫీ, రైతులకు అందించిన సేవలను వివరించారు. కార్యక్రమంలో వెంకటేశ్, సర్పంచ్ శైలజ, ఉప సర్పంచ్ గంగి యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, డైరెక్టర్లు దామోదర్ రెడ్డి ,మధుసూదన్ రెడ్డి, అంజిరెడ్డి, నర్సింహులు, రాములు, శ్యామలయ్య, సువర్ణ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

నందిగామ, సెప్టెంబర్ 30 : ఆయిల్‌పామ్ పంటల సాగుతో అధిక లాభాలను పొందవచ్చని షాద్‌నగర్ వ్యవసాయ శాఖ అధికారి రాజరత్నం అన్నారు. నందిగామ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉద్యాన, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి షాద్‌నగర్ ఏడీ రాజ రత్నం, హార్టికల్చర్ జిల్లా అధికారి సంజయ్ కుమార్ హాజరై మాట్లాడుతూ.. అధికారులు ఆయిల్‌పామ్ పంటల సాగుపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు ఎన్.రావ్, సోమిరెడ్డి, రఘు, రామకృష్ణ, ఉషారాణి, గోపాల్, నిషాంత్‌కుమార్, మధుసూదన్, శిరీష, కృష్ణమోహన్, ఏఈవోలు పాల్గొన్నారు.

## ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌టౌన్, సెప్టెంబర్ 30: ఐటీఐ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో ఐదవ విడుత ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని షాద్‌నగర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఆగస్టు సెషన్ కొరకు ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద వివిధ ట్రేడ్‌లలో శిక్షణ పొందటానికి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు ఈ నెల 8 వరకు htpp://iti.telangana.gov .in ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదే విధంగా ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న వారు, ఇదివరకే దరఖాస్తు చేసుకుని సీటు రాని విద్యార్థులందరూ ఈ నెల 9న వాక్ ఇన్ అడ్మిషన్స్‌కు నచ్చిన ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో ఆన్‌లైన్ అప్లికేషన్, ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని సూచించారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కుష్ఠు వ్యాధి నిర్మూలనలో భాగస్వాములవ్వాలి

తుర్కయాంజాల్, సెప్టెంబర్ 30: కుష్ఠు వ్యాధి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ధరణి కుమార్ అన్నారు. శనివారం మున్సిపాలిటి పరిధిలో కుష్ఠు వ్యాధి నిర్మూలన, వ్యాధి గుర్తింపుపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం కుష్ఠు వ్యాధి గుర్తించే విధానం, వ్యాధి నిర్మూలనకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రశేఖర్, సీహెచ్‌వో వెంకట్‌రెడ్డి, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులకు ఉచితంగా కంటి పరీక్షలు

యాచారం, సెప్టెంబర్ 30: మండల కేంద్రంలోని యాచారం పోలీస్ స్టేషన్‌లో శనివారం మ్యాక్స్‌క్యూర్ దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సీఐ సైదయ్య, ఎస్‌ఐలు గోపాల్, వెంకటనారాయణ, కానిస్టేబుల్స్, హోంగార్డులు, సిబ్బందికి వైద్యులు పలు రకాల వైద్య పరీక్షలను నిర్వహించారు. పోలీసులకు ఉచితంగా కంటి పరీక్షలను చేయించారు. పోలీసులు సైతం ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు, వైద్యులు పాల్గొన్నారు.

## పత్తికి మద్దతు ధర రూ.7,020

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 30: 2023-24 సంవత్సరానికి పత్తికి మద్దతు ధరలను ప్రభుత్వం ప్రకటించింది. పొడవు పింజ పత్తికి రూ.7,020, మధ్యస్థ పొడవు పింజ పత్తికి రూ.6,620 మద్దతు ధరలు ఇవ్వనున్నట్లు వ్యవసాయ మార్కెటింగ్ అధికారులు తెలిపారు. రైతులు పండించిన పంటను గ్రామాల్లో దళారులకు అమ్మి నష్టపోవొద్దని చెప్పారు. నాణ్యత ప్రమాణాలు పాటించి, భారత పత్తి సంస్థ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) వారు ప్రారంభించే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధరల పొందాలని సూచించారు. ఆధార్ ధ్రువీకరణ తర్వాతే కొనుగోలు కేంద్రాల్లో రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడుతారని తెలిపారు. ఆధార్‌కార్డును బ్యాంకు ఖాతాతో లింక్ కలిగి ఉండాలని సూచించారు.

## జోరుగా గణపతి లడ్డూల వేలం



శంకర్‌పల్లి : లడ్డూను సొంతం చేసుకున్న మందుమూల లక్ష్మణ్

శంకర్‌పల్లి, సెప్టెంబర్ 30 : దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా ప్రధాన కార్యదర్శి మందుమూల లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం రాత్రి శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూర్ గ్రామంలో వినాయక నిమజ్జయ కార్యక్రమంలో భాగంగా వేలం వేసిన లడ్డూనును రూ.1.50 లక్షలు, రెండవ లడ్డూను రూ. 1.09 లక్షలకు సొంతం చేసుకున్నాడు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ ప్రవళిక, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, బండ నర్సింహ, చాకలి రాములు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

**షాబాద్:** షాబాద్ మండలంలోని హైతాబాద్ గ్రామంలో వినాయకుడి లడ్డు వేలం పాట నిర్వహించారు. గ్రామంలోని వినాయకుడి వద్ద నిర్వహించిన లడ్డు వేలం పాటలో అదే గ్రామానికి చెందిన చర్ల కుమార్ మొదటి లడ్డు రూ.2.05 లక్షలకు కైవసం చేసుకోగా.. మరో లడ్డు మహేందర్‌రెడ్డి రూ.1.05లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కావలి మల్లేశ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గంగిడి భూపాల్‌రెడ్డి, నాయకులు సురేశ్ గౌడ్, కుమార్ తదితరులున్నారు.


### హెచ్చరిక ప్రకటన

నా క్లయింట్ తరపున సాధారణ ప్రజలందరినీ ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా నా క్లయింట్ ఆల పురుషోత్తం రావు తండ్రి ఆల అంజయ్య, నివాసం: ఇం.నం. 14-2-337/13, పాన్ మండి దగ్గర, గోషామహల్, హైదరాబాద్ వారు దావా షెడ్యూల్ ఆస్తి అనగా రంగారెడ్డి జిల్లా, కందుకూర్ మండలం, పులిమామిడి గ్రామం వద్ద గల ఎ. 14-38 గుంటల విస్తీర్ణం, సర్వే నం. 446 కలిగిన వ్యవసాయ భూమికి సంబంధించి బొందుగుల వెంకటేష్, తండ్రి లేట్ బి. కృష్ణ, నివాసం: ఇం.నం. 18-9-124, చాంద్రాయణగుట్ట, హైదరాబాద్ & 12 ఇతరులపై గౌరవనీయ V అడిషనల్ జిల్లా జడ్జి, ఆర్ఆర్‌జిల్లా ఎట్ ఎల్.బి.నగర్ వారి ఫైల్‌పై O.S.నం. 105/2023 ప్రకారం విభజన మరియు విడి స్వాధీనత కొరకు దావా దాఖలు చేసారు. మరియు రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు అనగా అగ్రిమెంట్ ఆఫ్ సేల్ కమ్ GPA విత్ పొసెషన్ డాక్యుమెంట్ నం. 600/2008. తేది: 25-01-2008, సేల్ డీడ్ డాక్యుమెంట్ నం. 3828/2008, తేది: 26-04-2008, డాక్యుమెంట్ నం. 2281/2016, తేది: 26-04-2016, డాక్యుమెంట్ నం. 2282/2016, తేది:26-04-2016, అగ్రిమెంట్ ఆఫ్ సేల్ కమ్ GPA డాక్యుమెంట్ నం. 5245/2018, తేది: 06-01-2018 మరియు డాక్యుమెంట్ నం. 5244/2018, తేది: 22-02-2018 లను చెల్లనివిగా ప్రకటించవలసిందిగా మరియు నాక్లయింట్ బాధ్యత వహించరని ప్రకటించవలసిందిగా దావా దాఖలు చేసారు. దావా పెండింగ్‌లో ఉన్న సమయంలో బొందుగుల వెంకటేష్, తండ్రి లేటు బి. కృష్ణ & ఆనెగోని అంజయ్య గౌడ్‌లు మూడవ పార్టీల పేరున పైన తెలిపిన ఆస్తిని అన్యాక్రాంతం చేయుటకు ప్రయత్నిస్తున్నారు. అందువలన ఏ విధమైన అమ్మక వ్యవహారం కుదుర్చుకొనరాదని మరియు పైన తెలిపిన ఆస్తి కొనుగోలు చేయరాదని సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరిస్తున్నాను. ఈ హెచ్చరిక ప్రకటన తరువాత కూడా ఎవరైనా వ్యక్తి లేదా వ్యక్తులు ఏదైనా అమ్మక ఒప్పందం, సేల్ డీడ్స్ లేదా ఏవైన డీడ్స్ కుదుర్చుకుంటే వాటికి నా క్లయింట్ బాధ్యులుకారు మరియు వాటి నుండి ఏర్పడే అన్ని వ్యయాలు, పర్యవసానాలకు మీరే బాధ్యులవుతారు.

సం/- **డి. వెంకట్ రెడ్డి,** అడ్వకేట్
ఇం.నం.11-8-157/A, రోడ్ నం.9, క్రాంతినగర్, కొత్తపేట్, హైదరాబాద్. సెల్: **9948097075**